# సింగిల్ పేజీ కథలు



## హార్ట్ ఎటాక్

"గోవిందరావు నిన్న రాత్రి హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయాడట'' రామ్మూర్తి బాధగా చెప్పాడు.

మేమందరం స్థాణువులయి పోయాం. గోవిందరావుకి వయస్సు కూడా పెద్దగా ఏమీలేదు. ఇంత సడెన్‌గా చనిపోయాడంటే నమ్మశక్యం కలగడంలేదు. మనిషి గుండ్రాయిలా వుండేవాడు. మూడురోజుల క్రితం గోవిందరావు సొంత ఊరికి వెళ్లాడు. సొంత ఊరిలోనే ప్రాణం పోయింది. చివరి చూపుకి కూడా మాకు అవకాశంలేదు.

సాయంత్రాలు నేను, రామ్మూర్తి, విశ్వనాథం, గోవిందరావు ఇందిరా లైబ్రరీకి వస్తుంటాము. ఒక విధంగా మేం నలుగురం మంచి స్నేహితులం. ఇక నుండి గోవిందరావు మా మధ్యన లేకపోవడం చాలా బాధగా వుంది.

విశ్వనాథం మావైపు చూసి ''ఎందుకలా బాధపడతారు. నిజం చెప్పాలంటే గోవిందరావు ఒక విధంగా చాలా అదృష్టవంతుడు. మనిషి తిరుగుతూ చనిపోవడం ఒక వరం. మంచంపట్టి అందరికీ కష్టాన్ని కలిగిస్తూ చావడం కంటే ఇలాంటి చావు ఎంతో అదృష్టమైనది'' అంటూ ఉపన్యాసం ఇచ్చాడు.

ఒక విధంగా విశ్వనాథం చెప్పిన మాటల్లో నిజం వుందనిపించింది.

విశ్వనాథమే మళ్లీ ''నాకు కూడా ఇటువంటి చావును ప్రసాదించమని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను'' అన్నాడు.

''ఊరుకోండి విశ్వనాథంగారూ. సంధ్యా సమయంలో ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. పైన దేవతలు తథాస్తు అంటారు'' అన్నాను.

''నిజంగానే నాకు అటువంటి చావే కావాలి'' స్థిరంగా చెప్పాడు విశ్వనాథం.

మాకెవరికీ మనస్సు బాగాలేకపోవడంతో చీకటి పడకుండానే ఇంటిదారి పట్టాము.

★★★

ఆ మాట విని క్షణంపాటు నా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. విశ్వనాథం గుండె నొప్పితో చనిపోయాడట. హాస్పిటల్ గుమ్మం ఎక్కుతుంటే గొల్లున ఏడుపులు వినిపించాయి. అంతే అడుగు ముందుకు తీయలేకపోయాను. విశ్వనాథం ఇక లేడు. దుఃఖం తన్నుకువచ్చింది.

★★★

అంతకుముందు నా జీవితంలో అంత పెద్దగా నవ్విన గుర్తులేదు. నవ్వుతుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. భలే గమ్మత్తయిన సంఘటన. నేను ఏడ్పులు విన్నది విశ్వనాథం కుటుంబ సభ్యులు కాదు. మరెవరో వ్యక్తి చనిపోయిన బంధువుల ఏడుపులు. నేను విశ్వనాథం కుటుంబ సభ్యులని పొరబడ్డాను. అసలు విశ్వనాథంకి హార్ట్ ఎటాక్ రాలేదు. ఛాతీలో గాలి వుండిపోవడం వలన చిన్న నొప్పి వచ్చింది. దానికి విశ్వనాథం హార్ట్ ఎటాక్ అని భయపడడంతో ముచ్చెమటలు పట్టి స్పృహ కోల్పోవడం జరిగింది. నాకు ఆ రోజు విశ్వనాథం ఇచ్చిన ఉపన్యాసం గుర్తుకి వచ్చి నవ్వు కట్టలు తెంచుకుంది.

**–టేకి జయప్రకాష్**
**సన్నాఫ్ టి.ఎస్. ప్రకాశరావు,**
**న్యూస్ట్రీట్, ఫస్ట్‌లేన్,**
**జైపూర్–764 001.★**

## కథ తెచ్చిన తంటా

"అమ్మా! నా కథ పడిందే'' ఆనందంగా పరుగెత్తుకొచ్చింది పదహారేళ్ల ప్రతిమ.

కొత్తగా వస్తున్న మాగజైన్. కొత్త రచయితలను ఎందరినో ఆదరిస్తోంది. ఆకర్షిస్తోంది. ఫోటోతో, పూర్తి అడ్రస్‌తో పడింది.

మొదటి కథ అచ్చులో చూసుకుని మురిసిపోయింది ప్రతిమ. చిన్న కథే అయినా బాగుందని మెచ్చుకున్నారు అందరూ. ప్రిన్సిపాల్ కూడా పిలిచి మెచ్చుకుంది. ప్రతిమ ఆనందానికి అంతులేదు.

''పోస్ట్'' పోస్టుమాన్ పిలుపు విని ప్రతిమ పరుగెత్తింది. తనకెవరు రాస్తారు ఉత్తరం? ఒక అభిమాని. కథ బాగుందని వ్రాసాడు. మొదటి ఉత్తరం, మొదటి అభిమాని. భద్రంగా దాచుకుంది ఆనందంగా.

రెండు రోజుల తరువాత మరో ఉత్తరం. దేవుడి ఉత్తరం. నూటపది సార్లు వ్రాసి పంపమని ఉంది. వ్రాయాలా? వద్దా? అమ్మో నూటపది రూపాయలు? అసలే పోస్టలు చార్జీలు పెరిగాయి. అంతేకాక తన వల్ల మళ్లీ నూట పదిమందికి ఖర్చు. అది అక్కడితో ఆగదు. కానీ దైవభీతి. ఏం చేయాలో తోచలేదు. అన్నయ్యను అడిగింది. ఉత్తరం ఏది అని అడిగి తీసుకుని చింపేసాడు. ప్రతిమ భయపడితే ''పాపం వస్తే నాకే కదా'' అన్నాడు.

ఇంకోరోజు రెండు ఉత్తరాలు. ఒకటి కష్టాల్లోవున్న తమ్ముడు ధనసహాయం చేయమని, ఇంకోటి కథ బాగుందని.

ఒక కళాసంస్థ సభ్యత్వం తీసుకోమంటూ మరో ఉత్తరం.

ఇంకొకటి కలం స్నేహం కోసం మరో ఉత్తరం. మరొకటి అభ్యంతరకరమైన ఉత్తరం పెళ్లి చేసుకుందామని. అందరికీ తనవల్ల కాదని మర్యాదగా తిరిగి వ్రాసింది.



మరో ఉత్తరం. ఏదో అసోసియేషన్‌లో చేరమని.

''ఏంటమ్మా ఇంత పోస్టు. ఈసారి ఇనాము పెంచాలి'' అని పోస్టుమాను సణిగాడు.

''ఏమిటే ఈ ఉత్తరాలు, జవాబులు. అసలే పోస్టల్ ఛార్జీలు పెరిగాయి. చుట్టాలకే వ్రాయలేకపోతుంటే'' నాన్నగారు చిరాకుపడ్డారు.

మరో కొత్త మాగజైన్‌లో కథలు, ఫోటోతో అడ్రస్‌తో పంపమన్న వినతిని చూసి ప్రతిమ ఉత్తరం వ్రాసింది ఎడిటర్‌కి.

''దయచేసి మీరు కథలు ప్రచురించండి. కానీ అడ్రెస్‌లు, ఫోటోలు ప్రచురించవద్దు. పోటీలో గెలిచినప్పుడు తప్ప. ఎందుకంటే అప్పుడైతే ఏదో కొంత సాధించినట్లు అవుతుంది కాబట్టి వేసినా తప్పులేదు.''

**–ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి**
**24-4-30/1, విష్ణుపురి,**
**సఫిల్‌గూడ,**
**హైదరాబాద్-47.★**